# తిరుపతి - చిత్తూరు





# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శ్రీసిటీ పర్యటన

సత్యవేడు, ఆగష్టు18, ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీసిటీ పర్యటన ఖరారైంది. పర్యటన వివరాలు ఇలా ఉంది. సోమవారం మధ్యాహ్నం 12గం॥లకు ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా శ్రీసిటీ హెలీపాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం ద్వారా12:05ని॥లకు శ్రీసిటీ బిజినెస్ సెంటర్ ప్రాంగణానికి చేరుకుంటారు. 12:10ని॥ల నుంచి 12:50 ని॥ల వరకు శ్రీసిటీ కంపెనీలకు సంబంధించిపలు ప్రాజెక్టులకు భూమిపూజ, ప్రారంభోత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1గం॥ నుండి 2గం॥ల వరకు ఫాక్స్ కాన్ గ్లోబల్‌సిఈఓలతో సమావేశం నిర్వహించబడుతుంది. 2గం॥ల నుంచి 2:30 గం॥ల వరకు ఎంపిక చేసిన సిఈఓలతో జరిగే సమావేశంలో శ్రీసిటీలో నడుస్తున్నవివిధ కంపెనీలు, వాటి ఉత్పత్తులు, ప్రగతి తదితర అంశాలపై ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు. ప్రసంగం ముగిసిన తరువాత 2:30 గం॥లకుముఖ్యమంత్రి శ్రీసిటీ బిజినెస్ సెంటర్ నుండి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని తిరుగు ప్రయాణం అవుతారు.




# బాద్యులెవరు!

## -టిటిడి పరిపాలన భవనంలో అగ్నిప్రమాదంపై అనుమానాలెన్నో?



తిరుపతి, ఆగస్ట్ 18ప్రభాతవార్త: మినీ సచివాలయం టిటిడి తిరుపతిలోని ప్రధాన పరిపాలన భవనంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (బైపాస్‌రోడ్డు సబ్‌డివిజన్) కార్యాలయం లో అగ్నిప్రమాదం జరగడానికి బాధ్యులెవరనేది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. హధ్యాహ్నం వేళ దీపం వెలిగించారని చెబుతుండటం, ప్రమాదవశాత్తు దీపం క్రిందపడి మంటలు చెలరేగాయని టిటిడి అధికారులు వెల్లడించడం ఎంతవరకు నిజమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదానికి కారకులెవరు? బాధ్యులె వరనేది? సమాధానం లేని ప్రశ్నలుగానే మిగిలిపోతాయనేది టిటిడి వర్గాల్లో దుమారం రేపుతోంది. టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో 1,500కోట్లకుపైగా నిధులు దుర్వి నియో గం, పక్కదారిపట్టించారని, కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు వేళ, ప్రభుత్వ విజిలెన్స్ విచార ణసాగుతున్న సమయంలో టిటిడి డిఇఇ ఎన్.భాస్కర్ 5వ నంబర్ కార్యాలయంలో దీపం వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో ఫైళ్ళు పాక్షి కంగా కాలిపోయాయని అధికారులు చెప్పడం అనుమానాలకు తావి స్తోంది. ఆదివారం ఈ చాంబర్‌ను తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, టిడిపి నేతలు పరిశీలించారు. సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైనవారిపై శిక్ష తప్పదని అన్నారు. ఈ నేపధ్యంలో రోడ్ల నిర్మాణంపై నిధులు వ్యయం, దుబారా నిధుల ఫైళ్ళు కాలిపోయాయానేది సందేహాలు. అయితే ఈ వివరాలన్నీ కంప్యూట రీకరణ చేయడం, ఇ ఫైలింగ్ విధానంలో భద్రం గానే ఉన్నాయని సిఇ నాగేశ్వరరావు, సివిఎస్ఓ శ్రీధర్ వెల్లడించడం కొంత ఊరట కలిగిస్తుందా అనేది చూడాల్సిందే. ప్రమాదవశాత్తు జరిగిందా? లేక వైసిపి నేతల ఒత్తిడితోకావాలనేఇలా చేశారా?!అనే అనుమానాలు టిటిడి వర్గాల్లోనే బలంగా వినిపిస్తున్నాయి.

# బదిలీల జాతర

- ఒకే ప్రదేశంలో ఐదేళ్ళు విధులు నిర్వర్తిస్తున్న వారికి తప్పనిసరి బదిలీ
- మిగిలిన వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుక్నునే అవకాశం

చిత్తూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీల జాతర ప్రారంభమైంది. ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం జిఓఎంఎస్ నెం.75ను జారీ చేసింది. ఈ నెలాఖరులోపు నిర్ధేశించిన ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలను పూర్తి చేయాలని ప్రభుత్వ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అలాగే సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఉద్యోగుల బదిలీలపై మళ్ళీ నిషేధం అమలులోకి వస్తుందని ప్రభుత్వ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ప్రభుత్వం జారీ చేసిన బదిలీల ఉత్తర్వుల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పౌర సరఫరాల శాఖ, భూగర్భ గనులు, అన్ని శాఖల్లోని ఇంజనీరింగ్ సిబ్బంది, దేవాదాయశాఖ, రవాణా శాఖ, పరిశ్రమల శాఖ, విద్యుత్ శాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖల్లో ఉద్యోగులు, సిబ్బంది బదిలీలు జరుగనున్నాయి. ఒకే ప్రదేశంలో ఐదేళ్ళ పాటు విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు తప్పనిసరి బదిలీ వుంటుంది. అలాగే 1-5 సంవత్సరాలు ఒకే ప్రదేశంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది బదిలీల కోసం దరఖఖాస్తులు చేసుకోవచ్చు. వారికి బదిలీ జరుగవచ్చును లేదా జరుగకపోవచ్చును. అలాగే ఎన్నికల విధులు నిర్వర్తించడానికి 2024 ఎన్నికలకు ముందు జిల్లా నుండి ఇతర జిల్లాలకు వెళ్ళి ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఇటీవల వారి సొంత జిల్లాలకు విధులు నిర్వర్తించడానికి వచ్చి విధుల్లో చేరిన అధికారులు, ఉద్యోగులకు ఈ బదిలీల్లో అవకాశం వుండదు. భర్త, భార్య ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులుగా వున్నట్లైతే వారిని సమీప ప్రాంతాల్లోనే బదిలీ చేయాల్సి వుంటుంది. అలాగే ఉద్యోగ యూనియన్ సంఘాల నాయకులకు ఒక ప్రదేశంలో తొమ్మిదేళ్ళ పాటు విధులు నిర్వర్తించడానికి అవకాశం కల్పించారు. ఒకే ప్రదేశంలో యూనియన్ సిఫార్సుతో ఎవరైనా ఉద్యోగ సంఘ నాయకులు 9 సంవత్సరాల విధులు పూర్తి చేసుకుని వుంటే అలాంటి వారికి ఈ బదిలీల్లో బదిలీ తప్పదు.

### సచివాలయ సిబ్బందికి బదిలీలు లేవు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం జరిగే బదిలీల్లో అవకాశం వుండదు. ఎవరైనా సచివాలయ సిబ్బంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకుంటే ఉన్నత అధికారులు పరిశీలించి వీలైతే బదిలీ చేస్తారు. బదిలీ చేయకుంటే అదే ప్రదేశంలో సచివాలయ ఉద్యోదులు విధులు నిర్వర్తించాల్సి వుంటుంది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం ప్రస్తుతం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఏదేని ఒక ప్రదేశంలో ఐదేళ్ళ పాటు విధులు నిర్వర్తించిన ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి వుంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఎవ్వరికి వారు విధుల్లో చేరి ఐదు సంవత్సరాలు పూర్తి కాలేదు. కావున ప్రస్తుత బదిలీల్లో వీరికి బదిలీలు వుండవు. ప్రస్తుతం ఎక్కడైతే విధులు నిర్వర్తిస్తున్నారో అక్కడే వీరు విధులు నిర్వర్తించాల్సి వుంటుంది.



# పోతపోలయిండ్లు వద్ద ఏనుగుల గుంపు దాడులు

## -వరి, చెరకు పంటలు ధ్వంసం

ఐరాల, ఆగస్టు 18 ప్రభాతవార్త: మండలంలోని ఐరాల పంచాయతీ పోతపోటయిండ్లు గ్రామ సమీపంలోని పంటపొలాలపై మూడు ఏనుగుల గుంపు శనివారం రాత్రి దాడులు చేసి పలువురు రైతులకు చెందిన పంట పొలాలను ధ్వసం చేశాయి. శనివారం పోతపోటయిండ్లు వద్ద రైతుల పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడులు చేసి పలు పంటలను ధ్వంసం చేశాయి. ఈమేరకు పోతపోటయిండ్లుకుజయమ్మ, రఘునాద్‌లకు చెందిన వరి పంటను, హరి అనే రైతుకు చెందిన చెరకు, రామకృష్ణ, భాస్కర్‌లకు చెందిన వరి పంటలను ఏనుగుల గుంపు దాడులు చేసి ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడుల విషయమై బాధిత రైతులు ఆదివారం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని పంట నష్టం అంచనా వేశారు. ఏనుగుల దాడుల్లో రైతుల పంటపొలాలకు భారీ నష్టం వాటిల్లింది. గత కొద్ది రోజులుగా ఏనుగులు దాడులు చేస్తూ పంట పొలాలను ధ ్వంసం చేస్తుండడంతో గ్రామస్థులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# సరిహద్దుల్లో దర్జాగా ప్రభుత్వ భూమిలో పాగా

## ఔ పెద్దవంకలో భూమిచదును చేస్తున్న తమిళవాసులు!

కుప్పంరూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త : కుప్పం మండల సరిహద్దుల్లోని నాయనూరు పంచాయతీ పెద్దవంక సమీపంలో ఆ ంధ్ర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని తమిళనాడుకు చెందిన వ్యక్తులు చదును చేస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న ఈ భూమిలో స్థానిక ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అని గతంలో సిద్ధం చేసి ఉంచారు. రెండేళ్ల క్రితం ఈ భూమిపై కన్నేసిన తమిళనాడు వాసులు జెసిబితో చదును చేశారు. అప్పట్లో 'వార్త'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. తమిళనాడు వాసులు చేస్తున్న భూమి చదును పనులను అడ్డుకున్నారు. అయితే మరలా రెండేళ్ల అనంతరం తమిళనాడు వాసులు కొంతమంది ఆంధ్ర ప్రాంతంలో ఉన్న భూమిపై మరలా కన్నేశారు. తాజాగా జెసిబి యంత్రం సాయంతో భూమి చదును చేయడం మొదలు పెట్టారు. రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమిలో దాదాపు ఒకటిన్నర ఎకరాల మేర కబ్జా చేసేందుకు తమిళనాడు వాసులు యత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆంధ్ర ప్రాంతానికి చెందిన భూమిని ఆక్రమించే యత్నం చేస్తున్న తమిళనాడు వాసులపై తగు చర్యలు తీసుకోవాలని అలాగే గ్రామంలో అర్హత కలిగిన వారికి ఆ భూమిలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# మాస్టర్ ప్లాన్‌తో... ఆలయం చుట్టూ అభివృద్ధి

## -మాస్టర్ ప్లాన్ కమిటీ వెల్లడి

శ్రీకాళహస్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం నియోజకవర్గంలో కీలకమైనదని ఈ ఆలయానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై ఆదివారం ప్రత్యేక కమిటి సమావేశం జరిగిందని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వివరించారు. సమావేశం తరువాత మీడియాతో మాట్లాడిన ఆయన పలు అంశాలకు సంబందించి వివరించారు. మాస్టర్ ప్లాన్‌లో అందమైన రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. జల వినాయకుని ఆలయం సమీపంలోని వంతెన నుంచి దక్షిణాన కరకట్టపై నుంచి శుకబ్రహ్మాశ్రమం సమీపం వరకు కొత్తగా రోడ్డు ఏర్పాటు చేసి దానిని భరద్వాజ తీర్థంలోకి అనుసంధానం చేయుటకు పరిశీలిస్తున్నట్లు వివరించారు. మాస్టర్ ప్లాన్‌లో ఆలయం చుట్టూ అందమైన 40అడుగుల రోడ్లుతో పాటు పక్కనే వాకింగ్ ట్రాక్, అలాగే సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని వివరించారు. గతంలో మాస్టర్ ప్లాన్ తన తండ్రి హయాంలోనే రూపొందించారని కానీ ఐదేళ్ల పాటు పరిపాలించిన వారు నిర్లక్ష్యం చేసారన్నారు. రాబోవు రోజుల్లో సమగ్ర మార్పులు చేర్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న భరద్వాజతీర్థంలోనికి పార్కింగ్, పరిపాలనా భవనాలు, అన్నదాన మండపం అతిధి గృహాలను నిర్మిస్తామన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో సత్రాలు నిర్మిస్తామన్నారు. ఇక్కడ పిల్లలను ఆకర్షించే రీతిలో ఈ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సమీక్షల్లో తనతో పాటు ఆలయ ఇఓ ఎస్‌వియస్ఎన్ మూర్తి, మాస్టర్‌ప్లాన్ కమిటి సలహాదారు కొండల రావు, దేవాదాయశాఖ సిఇ శేఖర్, ఎస్ఇ గంగయ్య, సిద్దార్థ, ఆదిశక్తి కళాశాలల ప్రిన్సిపల్స్ ఆలయానికి చెందిన డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఇ వేణుగోపాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.






## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

రామకుప్పం, ఆగస్టు 18 ప్రభాతవార్త



కుప్పం పిఇఎస్ ఆస ్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధ్వర్యంలో స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆల యం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఆపరే షన్లకు 35మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులుహర్షిత,పుష్పక్,పిఆర్ఎవెంకటేష్ పాల్గొన్నారు

## వెలగని వీధి దీపాలు స్పందించని అధికారులు

పాకాల, ఆగస్టు 18, ప్రభాతవార్త



పాకాల మండలం పెద్దగొర్పాడు పంచాయితీ గొర్పాడు గ్రామంలో గత ఆరు నెలల నుంచి రాత్రి పూట వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట పాములు జర్రులు, తేళ్ల తిరుగుతూ ఉన్నందున ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఈ పరిస్థితిపై పంచాయితీ సెక్రటరీని వివరణ కోరగా పంచాయితీలో డబ్బులు లేవని నిధులు వస్తే పరిస్థితిని చక్కదిద్దుతామని చెప్పారు. కానీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో పంచాయితీ సెక్రెటరీ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వెంటనే వీది దీపాలు వెలిగేలా చేయాలని గ్రామస్తులు కోరుకుంటన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఎదేని సమస్యలను నేరుగా అధికారుల వద్దకు వచ్చి విన్నవించుకుంటే వారు వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## వైభవంగా పెద్ద తయ్యూరులో గీతజ్ఞాన యజ్ఞం

**శ్రీరంగరాజపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మండలంలోని పెద్ద తయ్యూరు గ్రామంలో ఆదివారం సామూహిక గీత యాజ్ఞ యజ్ఞంను ప్రజలు వైభవంగా నిర్వహించారు. రాధా కృష్ణ భజన మందిరం మండల పూజలో భాగంగా గత తొమ్మిది రోజులుగా ఆచార్యులు సుధాకర్ గీతా పారాయణం చేసి ఆదివారం తన బృందం బెంగళూరు కృష్ణస్వామి, సోమనాథ్‌రెడ్డిలు, గ్రామస్తులతో కలిసి గీతజ్ఞాన యజ్ఞం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు, యువత భక్తిశ్రద్ధలతో గీతా జ్ఞాన యజ్ఞంలో పాల్గొని హోమ కార్యక్రమంలో పాల్గొని హోమద్రవ్యాలు సమర్పించారు. పెద్దతయ్యూరు గ్రామం మొత్తం ఈ సందర్భంగా భగవద్గీత శ్లోకాలతో హోరెత్తింది. ఈ కార్యక్రమంలో నరసింహాచారి, చెన్నకేశవరెడ్డి, నటరాజ ఆచ్చారి, చిరంజీవినాయుడు, గ్రామస్తులు, యువత పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## నేడు పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్

**చిత్తూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి పాత జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలనుఎస్పీమణికంఠచందోలు,ఇతరపోలీసుఉన్నతఅధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చు.

## కోటేశ్వర్‌రావుకి మిత్ర బృందం ఘన సత్కారం

**ఏర్పేడు, ఆగస్టు18, ప్రభాతవార్త;** గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులుగా కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన తోటకూర కోటేశ్వర్‌రావు ఎన్నికైన సందర్భంగా తన సహచర మిత్ర బృందం ఆదివారం ఆయన నివాసంలో కలుసుకొని దుశ్శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈసందర్బంగా వారు కోటేశ్వర్‌రావుని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని రాష్ట్ర అధ్యక్షులుగా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సచివాలయ ఉద్యోగులందరికి అండగా ఉండాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ఏర్పేడు మండల వైస్ ఎంపిపి జమళ్ల శ్రీనివాసులు, మండల బిసి సెల్ అధ్యక్షులు ఎం.మునయ్య, ఏర్పేడు హైస్కూల్ విద్యా కమిటీ చైర్మెన్ సాంబయ్య, సుధాకర్, మురళీమోహన్, హరిబాబు, వెంకటప్రసాద్, చంద్రశేఖర్, తులసీరామ్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఆంజనేయస్వామి ఊరేగింపు

సదుం,ఆగస్టు18ప్రభాతవార్త



మండల పరిదిలోని జోగివారిపల్లె పంచాయి బత్తల వారిపల్లెలో నిర్మించిన శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి వారి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఆంజనేయస్వామి వారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఉదయం ఆలయంలో దీక్షాహోమం జరిపించారు. అనంతరం నవగ్రహ అష్టదిక్పాలక హోమం, మన్యసూక్త హోమం, న్యాస హోమం జరిపిన అనంతరం కార్యసిద్ధి ఆంజనేయ స్వామి విశేషాంగ ఫల పంచామృత అభిషేకం జరిపి భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కేరళ వాయిద్య బృందాల నడుమ ఆంజనేయస్వామి వారిని ఘనంగా గ్రామంలోని అన్ని వీధులలో ఊరేగించారు. సాయంత్రం శయ్యాదివాసం, పుష్పాదివాసం ధనాదివాసం అనంతరం మహామంగళ హారతి నిచ్చారు. రాత్రి ఢీ,జబర్దస్త్,శ్రీదేవి డ్రామాకంపెనీ ఆర్టిస్టులచే పాటకచేరి నిర్వహించారు. భక్తులకు నిరంతరాయంగా అన్నదానం నిర్వహించారు.సుంకర కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

## యర్రావారిపాలెం ఎస్సైగా ఎర్రుస్వామి

యర్రావారిపాలెం,ఆగస్టు18ప్రభాతవార్త



యర్రావారిపాలెం పోలీసుస్టేషన్ ఎస్సైగా డి.ఎర్రుస్వామి ఆదివారం బాద్యతలు చేపట్టారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ఎవరిని ఉపేక్షించేది లేదని చెప్పారు. అదేవిధంగా ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. సారాయి, గంజాయి వంటివి మండలంలో ఎక్కడా కనపడరాదని చెప్పారు.

## 1.ఉచిత కంటి ఆపరేషన్లకు 49మంది ఎంపిక

కుప్పం, ఆగస్టు 18 ప్రభాతవార్త



సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శ ంకర కంటి ఆస్పత్రిచే ఆదివారం కుప్పం బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 180 మంది ఈ శిబిరంకు హాజరు కాగా వైద్యులు వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. 49మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వైద్య బృందం గంగాధర్, శివ, లావణ్య, నేత్ర, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్.. తనయుడు అరెస్ట్

కుప్పం, ఆగస్టు 18 ప్రభాతవార్త



కుప్పం మండల వైకాపా కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ అతని తనయుడు శ్రీనురాజేంద్రప్రసాద్‌లను కుప్పం పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఈనెల 30వతేది వరకు రిమాండ్ విధించారు. మల్లానూరుకు చెందిన ఎంఆర్‌పిఎస్ నాయకుడు ప్రకాష్ మాదిగ ఇటీవల తనను మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో హెచ్ఎం మురుగేష్‌ను అరెస్ట్ చేశారు. అలాగే మండలంలోని మల్లానూరు పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ఈ ఏడాది జనవరిలో చోరీకి గురికాగా అప్పట్లో పంచాయతీ కార్యదర్శి రమ్యలక్ష్మి ట్రాక్టర్ చోరీ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయ ం విదితమే. ఈ కేసుకు సంబంధించి కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, అతని తనయుడు శ్రీను రాజే ంద్రప్రసాద్‌లను అరెస్ట్ చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశించారు.

## స్వీపర్ ఆత్మహత్యపై పూర్తిస్థాయి విచారణ జరగాలి

కుప్పంరూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త



మండలంలోని కస్తూరిబా గురుకులంలో స్వీపర్‌గా పనిచేస్తున్న సెల్వమ్మ (55) ఆత మ్మహత్యకు గల కారణాలను పోలీసులు విచారణలో తేల్చాలని ఎంఎస్‌పి జిల్లా నేత దేవరాజు, ఎంఆర్‌పిఎస్ నేతలు మురుగేష్, గోవిందప్ప, కోదండప్ప పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సెల్వమ్మ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ స ంఘటనపై పూర్తిస్థాయిలో పోలీసులు విచారణ జరిపి వాస్తవాలు వెలికితీయాలని వారు పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గంగా భవానీ చెంత భక్తుల సందడి...!

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 18 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ ఆలయానికి యాత్రీకుల రద్దీ పెరిగింది. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలివచ్చారు. దీంతో కొండ భక్తజన సంద్రమైంది. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం,అలంకరణగావించారు.వరకు క్యూలైన్లలో భక్తులు కిటకిటలాడారు. ఆలయఇఓఉప కమీషనర్ ఏకాంబరం, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు నియామకం

పుంగనూరు,ఆగస్టు 18 ప్రభాతవార్త



వివాదాస్పద కేసుల మలుపులతో ఇంతకాలం హడావుడి పడిపోయిన పుంగనూరు ఇపుడిపుడే ఊపిరి తీసుకుంటోంది. పుంగనూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సిఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాసులు పుంగనూరు సిఐగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనను తెలుగుదేశం పార్టీ జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్‌నుహేల్‌బాషా సత్కరించారు. ఈసందర్భంగా సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ పుంగనూరు అర్బన్ పరిధిలోని పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు ఎటువంటి చర్యలకైనా వెనుకాడబోమని,పుంగనూరులో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించాలని యత్నిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## వైద్యులకు రక్షణ కల్పించాలి..నిందితులను శిక్షించాలి

పుంగనూరు,ఆగస్టు 18 ప్రభాతవార్త :



కోల్‌కత్తా దారుణ ఘటనలో హత్యాచారానికి గురైన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను శిక్షించాలని డిమాండ్‌చేస్తూ పుంగనూరు ఏరియా వైద్యశాల డాక్టర్లు,సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈమేరకు ఆదివారం ఉదయం వైద్యశాల వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రపంచ చరిత్రలోనే అత్యంత పాశవికంగా వైద్యవిద్యార్థినిని హత్యాచారం చేసిన గ్యాంగ్ మొత్తాన్ని లాగాలని,వారికి తక్షణం శిక్షపడేలా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పుంగనూరు రచయితలకు కర్నాటక సత్కారం

పుంగనూరు,ఆగస్టు 18 ప్రభాతవార్త :



కర్నాటకలోని బెంగళూరులో కర్నాటక రచయితల సమాఖ్య అధ్వర ్యంలో జరిగిన కవిసమ్మేళనంలో పుంగ నూరు రచయితలు సన్మానించబడ్డారు. పుంగనూరు రచయితల సంఘానికి చెందిన రచయిత్రులు హసీనాబేగం,స్రవంతి,గాయత్రి,రహత్‌జాన్‌లను సమాఖ్య ఘనంగా సత్కరించింది. మాజీ రాష్ట్రపతి దివంగత సర్వేపల్లిరాధాకృష్ణన్ మనుమడు సుబ్రహ్మణ్య శర్మ ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై కవులను సత్కరించారు.

## సారాతో సహా మహిళ పట్టివేత

సదుం,ఆగస్టు18ప్రభాతవార్త



మండల పరిదిలో సారా అమ్ముతున్న మహిళతో సహా సారానుపట్టుకున్న సంఘటన ఆదివారం జరిగింది. ఎస్సై షేక్షావలి తెలిపిన మేరకు యర్రాతివారిపల్లె హరిజనవాడలో తాము సిబ్బందితో కలిపి కార్డన్ సెర్చ్ నిర్వహించామని చెప్పారు. ఈసందర్భంగా కల్పన అనే మహిళ ఇంటిలో తనిఖీ చేశారు. అక్కడ పదిలీటర్ల నాటు సారా లబించింది. సారాను స్వాదీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసామని ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి పీలరు కోర్టుకు తరలించామని వివరించారు. ఇళ్లలో అనుమానం రాకుండా ఎవరైనా నాటు సారా అమ్ముతుంటే తమకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి సారాను స్వాదీనం చేసుకుంటామని ఈసందర్బంగా ఆయన చెప్పారు. అదేవిధంగా ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే సమాచారం అందించాలని కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మాజీ ఎస్వీబీసీ చైర్మన్ సాయి కృష్ణతో భేటీ అయిన వైసిపి జిల్లా అధ్యక్షులు రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 18, ప్రభాతవార్త



మాజీ శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ చైర్మన్ డాక్టర్ విబి సాయి కృష్ణ యాచేంద్రతో వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. వెంకటగిరిలోనే రాజాల భవనంలో ఇరువురు కలిసి పలు అంశాలపై చర్చించారు. రాజకీయ పరిణామాలపై వారు చర్చించినట్లు తెలిసింది. రామ్ కుమార్ రెడ్డివైసిపిపార్టీచెందినపలువురువివాహ పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడే వారికే రక్షణ కరవు

డాక్టర్, శ్రీకాంత్ రెడ్డి

కోట,ఆగస్టు 18 ప్రభాతవార్త



కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్దిని హత్యాచార ఘటన జరగడం దురష్టకమని కోటలోని చిన్ని పిల్లల వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ కరవైందని అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.దేశంలో వైద్యులు, ఆసపత్రులు సిబ్బందిపై దాడులు ఎక్కువయ్యాని పేర్కొన్నారు.జూనియర్ వైద్యురాలి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. దాడుల, హత్యలు, అత్యాచారాల, విధ్వంసాలు అరికట్టడంతో పాటు రక్షణ కల్పించాలని డిమాండు చేశారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి నిందితులను కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం

వెంకటగిరి, ఆగస్టు 18, ప్రభాతవార్త

వెంకటగిరి ప్రాంతంలో ఉరుములు, మెరుపుతో కూడిన భారీ వర్షం పడింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమైయమయ్యాయి గత వారం రోజుల నుండి ఎండకు ప్రజలు అల్లాడుతుండడంతో ఈ వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దాదాపు 20 నిమిషాలు పడింది.

## 20న అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

వెంకటగిరి, ఆగస్టు 18, ప్రభాతవార్త

పట్టణంలోని క్రాస్ రోడ్డు ప్రాంతంలో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని 20వ తేది ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు దళిత బహుజన ఐక్యవేదిక సంఘ నాయకులు తెలిపారు. విగ్రహావిష్కరణకు పలువురు దళిత సంఘ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు.

## ఘనంగా కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ జన్మదిన వేడుకలు

గూడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని సంగం థియేటర్ కూడలి వద్ద కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ జన్మదిన వేడుకలను హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కంకణాల పెంచల్ నాయుడు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకొన్నదని నిర్మల సీతారామన్‌ను కొనియాడారు. దేశ ఆర్థిక శాఖా మంత్రిగా తాను సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ఆమె భవిష్యత్‌లో మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ

గూడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణ, పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆ సంస్థ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ తెలియజేశారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆర్ఆర్ ప్రొవిజన్ ప్రభాకర్ రెడ్డి దాతృత్వంతో 20 మంది దివ్యాంగులకు కూరగాయలు, నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దివ్యాంగులైన సోదరులకు ప్రతి నెల మూడవ ఆదివారం కూరగాయలు, గుడ్లు పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టి సంవత్సరం పూర్తి చేసుకుని రెండవ సంవత్సరంలో అడుగుపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగరాజు, చెంచు నారాయణ, రాధయ్య, శ్రీనివాసాచారి, సుబ్రమణ్యం, రజిని, ప్రసాద్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త



కలకత్తాలో జరిగిన మహిళా డాక్టర్ అత్యాచారం, హత్య సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. డాక్టర్లుకు టిడిపి పూర్తి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా డాక్టర్లకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత తానంకి నానాజీ, నెలబల్లి భాస్కర్ రెడ్డి, కిరణ్ కుమార్, చెంచు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం

గూడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త



గత మూడు సంవత్సరాలుగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా పథకం నిర్వహించేందుకు డాక్టర్ సిఆర్ రెడ్డి కుటుంబ సభ్యులు అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమని రోటరీ క్లబ్ వెస్ట్ మాజీ అధ్యక్షుడు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు సనత్ కుమార్ రెడ్డి అన్నారు. గూడూరు పట్టణ పరిధిలోని రెడ్డి కమ్యూనిటీలో ఉన్న పలు పేద కుటుంబాలను సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం గుర్తించి వారికి ప్రతి నెల మూడు ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దివంగత డాక్టర్ సిఆర్ రెడ్డి వైద్య రంగంలో అనేక సేవలు అందించడంతో పాటు పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఆయన పేరు మీద నిర్వహిస్తున్న డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా పథకానికి ఆయన కుమార్తె డాక్టర్ రోహిణి, ఆయన అల్లుడు డాక్టర్ జనార్ధన్ రెడ్డి పూర్తి సహకారాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కోట, ఆగస్టు 18 ప్రభాతవార్త



కోట మండలం చంద్రశేఖరపురం గ్రామం వద్ద ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటనలో రెండు ద్విచక్ర వాహనాలు మంటల్లో పూర్తిగా దగ్ధమయ్యాయి. చిట్టేడు గ్రామానికి చెందిన తిరుమల పార్వతయ్య కాలికి గాయమైంది. చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన మహేష్, శ్రీనివాసులుకు గాయాల య్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం గూడూరు ప్రభుత్వాసుపత్రికి 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లారు.

## టిసిఎల్ జెర్సీలు ఆవిష్కరణ

గూడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కూడా 19 మండలాల జట్లతో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం నందు ఈ నెల 25 నుండి 28వ తేది వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఈ క్రీడా పోటీలకు సంబంధించి టీమ్‌ల జెర్సీలను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ 19 రకాల కలర్ ఫుల్ జెర్సీస్ ఉపాధ్యాయులకు అందించి ఈ టిసిఎల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నందుకు ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్‌ని అభినందించారు. గూడూరులో ఆరు సంవత్సరాలుగా ఈ టీచర్స్ క్రొకెట్ లీగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రగతి సేవా సంస్థ ఆధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ 2019లో ప్రారంభించిన టిసిఎల్ టోర్నమెంట్ ఆరు సంవత్సరాలుగా ఉపాధ్యాయులు అందరి సహకారంతో నేడు 19 జట్లతో 19 మండలాల కెప్టన్లు, క్రీడాకారులు ఘనంగా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి కరిముల్లా, మురళి సింగ్, బాబర్, పిఈటి భాస్కర్, మనీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఊనుగుంటపాలెం స్కూలు చైర్మన్‌గా నాగమణి ఏకగ్రీవం

కోట, ఆగస్టు 18 ప్రభాతవార్త



కోట మండలం ఊనుగుంటపాలెం ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో స్కూలు ఛైర్మన్‌గా వైసీపీకి చెందిన తుపాకుల నాగమణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ఛైర్మన్‌గా మొలకల రజనిని ఎన్నుకున్నారు. వైసీపీ సెంట్రల్ కమిటీ సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి సూచనల మేరకు ఈ ఎన్నికను ఏకగ్రీవం చేసుకున్నట్లు వైసీపీ నాయకులు కోటారెడ్డి తెలిపారు. అనంతరం ఛైర్మన్ నాగమణి, వైస్ ఛైర్మర్ రజనిలను శాలువాలు, పూలమాలతో అభినందించారు.కృష్ణయ్య, నాగూర్ యాదవ్, మద్దాలి సుబ్బరామిరెడ్డి, ముంగమూడి కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## అపాచి మలుపు వద్ద రోడ్డు ప్రమాదం

- సెక్యూరిటీ గార్డు మృతి

తడ, ఆగస్టు 18 ప్రభాతవార్త



తడ మండలం కొండూరు సమీపంలోని మాంబట్టు సెజ్‌కు వెళ్లే మలుపు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు, అపాచి పరిశ్రమలో గత 13 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తడ మండలం కారిజాతకు చెందిన దువ్వూరు రామకృష్ణారెడ్డి (60) విధులకు వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. మలుపు వద్ద జాతీయ రహదారి దాటుతున్న స్కూటీని చెన్నై నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళుతున్న మోటార్‌బైక్ ఢీకొనడంతో రామకృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు హుటాహుటిన సూళ్లూరుపేటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్ఐ నరసింహారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కారణమైన మోటార్‌సైక్లిస్టు, తెలంగాణకు చెందిన చింతగుంట ఈశ్వరసాయిగా గుర్తించారు.

## పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక



**ఏర్పేడు, ఆగస్టు18,ప్రభాతవార్త;** మండల కేంద్రమైన ఏర్పేడు హైస్కూల్ నందు 2002-03 చదువుకున్న పూర్వ విద్యార్థులు జీవనోపాధి వేటలో ఎక్కడెక్కడో ఉద్యోగ ఉపాధి మార్గంగా జీవనం సాగిస్తున్నారు. కొందరు మిత్రులు స్పందించి అప్పటిలో ఇక్కడ చదువుకున్న వారందరితో ఫోన్ ద్వారా వారందరిని సంప్రదించి వేదికగా చదువుకున్న పాఠశాలలోనే ఆదివారం కలుసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు సత్కారాలు చేసి పాదనమస్కారాలు చేసుకున్నారు. సహచర మిత్రులంతా ఒకరినొకరిని పలకరించుకొని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈకార్యక్రమంలో విరామ ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, అధ్యాపకులు వనజాక్షి, నాగరాజు, సుందరమ్మ, భువనేశ్వరి, వర్మ, మూర్తి, వరలక్ష్మి,గౌస్,వాసు,సుధాకర్, దశరదరామిరెడ్డి, ప్రసాద్, నారాయణ, వార్డెన్ వెంకటేశ్వరు పాల్గొన్నా రు

## శివయ్య సేవలో భల్లా పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వ రుని ఆదివారం కేంద్ర హోం కార్యదర్శి అజయ్‌కు మార్ భల్లా కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆయన మధ్యాహ్నం శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఆలయ ఎసి మల్లికార్జున ప్రసాద్, టెంపుల్‌ఇ న్స్ పెక్టర్ హరియాదవ్, పిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు సుమారు 10 మంది వచ్చారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి గురుదక్షి ణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలుఅ ందించి తీర్థ ప్రసాదాలను అందించారు.

## శివయ్య సన్నిధిలో భక్తుల తాకిడి:పూజల సందడి:

గణనీయంగా పూజలు: అభిషేకాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం వారాంతపురద్దీ చోటు చేసుకుంది. వరుస సెలవు కావటంతో రద్దీ పెరుగుతుంది. ఆదివారం భోళాశంకరుని సన్నిధిలో అతిధుల తాకిడి పెరిగింది. ఈ నేపధ్యంలో పూజలు చేయించుకునే భక్తులు ఇబ్బంది పడకుండా ఇఒ ఎన్‌వియస్ఎన్ మూర్తి ఆదేశాలతో సిబ్బంది ఉదయం నుంచి ఆలయంలోని రాహుకేతుదోష పూజలు నిర్వహించే మండపాల్లో పరిశీలనలు జరిపారు. భక్తుల భద్రతపై దృష్టి సారిస్తున్నారు. ఉదయం నుంచి ఇఒ రద్దీ ఎక్కువగా ఉంటే రూ.500లు, రూ.750, రూ.1500 మండపాల్లో పర్యవేక్షించారు. రాహుకేతుదోషనివారణపూజలు4వేలుజరిగినట్లు దేవస్థానం విడుదల చేసిన సమాచారంలో పేర్కొన్నారు. **పెరుగుతున్న రాహుకేతు పూజలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం దేవస్థానం అందించిన సమాచారం మేరకు 21వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రకటించారు. కాగా రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500ల టిక్కెట్లతో 2501 మంది, రూ.750 టటిక్కెట్లతో 864 మంది, రూ.1500టిక్కెట్లతో 265 మంది, రూ.2500 టిక్కెట్లతో ఆలయం లోపల 243 మంది, రూ.5వేల టిక్కెట్లతో 64 మంది పూజలు జరిపించుకున్నారు. ఇక అభిషేకాలు 105 మంది జరిపించుకోగా 34 మంది మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించుకోగా శనీశ్వర అభిషేకాలు 4 జరిపించుకోగా ప్రసాదాలు సుమారు 21వేలు జరిగినట్లు సమాచారం. అయితే శ్రావణ మాసం కావటంతో భక్తుల తాకిడి పరిమితంగా ఉంది. దాంతో వచ్చిన భక్తులు సత్వరంగా సుదర్శనం చేసుకుంటున్నారు.

## పాఠశాలలు, కళాశాలల బస్సులు ఆకస్మిక తనిఖీ

-9బస్సులపై కేసులు నమోదు

.శ్రీకాళహస్తి, ఆగస్టు 18 ప్రభాతవార్త



గత మూడు రోజులుగా శ్రీకాళహస్తి పట్టణంలోని పాఠశా లలు మరియు కళాశాలల బస్సులను మోటారువాహనాల తనిఖీ అధికారి దామోదరనాయుడు తెలిపారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ 9 బస్సులపై కేసులు నమోదు చేయడంతో పాటు 5బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్ళడం, రెండు బస్సులుకు సరైన లైసెన్సులు లేకుండా గత ఐదు సంవత్సరాల అనుభవం లేకుండా నడుపుతున్నట్లు గుర్తించామని మరియు రెండు బస్సులకు ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. ఈకేసుల ద్వారా రూ.70,400వేలు పన్నులు రూపంలో వసూలు చేసినట్లు ఆర్టీవో తెలిపారు. ఈసందర్భంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదరనాయుడు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పాఠశాలల యాజమాన్యాలు గమనించి విద్యార్థుల సంఖ్యను అనుసరించి సరిపడా బస్సులు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ తనిఖీలు ఇకముందు కూడా కొనసాగుతాయన్నారు. ఎవరైనా సరైన రికార్డులు లేకుండా మరియు అనుభవం లేని డ్రైవర్లచే పాఠశాలల బస్సులును నడిపినట్లు గమనిస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నియమనిబంధనలను అనుసరించి వాహనాలు నడిపి విద్యార్థులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. విద్యార్థులను బస్సుల్లో కాకుండా ఆటోల్లో తీసుకెళ్ళినట్లు పిర్యాదులు వస్తే చర్యలు తప్పవని వివరించారు. పాఠశాల, కళాశాల యాజమాన్యాలు బస్సులకు చెందిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవడంతో అనుభవం లేని డ్రైవర్లను నియమిస్తే చర్యలు తప్పవన్నారు

## తొట్టంబేడు మండలంలో ఆగని మట్టిమాఫియా

-గుండేలిగుంట



చెరువులో మట్టి తరలింపు

తొట్టంబేడు, ఆగస్టు 18 ప్రభాతవార్త

మండలంలో ఓవైపు మట్టిమాఫియా, మరో వైపు ఇసుక మాఫియా కొనసాగుతూనే ఉంది. పత్రికల్లో వార్తలు వచ్చినా మట్టిమాఫియా బృందం తమ పనులు చేసుకుని పోతోంది. గత ప్రభుత్వ హయాంలో గుండేలిగుంట చెరువులో మెగా కంపెనీ ఆరులైన్ల రోడ్డుకు ఇష్టారాజ్యంగా మట్టిని తరలించి చెరువును గుంతలతో నింపేశారు. ప్రస్తుతం ఇదే చెరువులో తిరిగి మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. గత నాలుగు రోజులుగా మట్టి అక్రమరవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. చెరువు ఎదురుగానే సచివాలయం ఉంది. ఇక్కడ ఉన్న అధికారి మట్టి తరలింపుపై పట్టించుకోవడం లేదని బాహాటంగానే విమర్శలు వస్తున్నాయి. మట్టిని తరలించి చదును చేసేశాని అధికారులు పేర్కొంటున్నారు. మట్టిని ఎక్కడకు తరలిస్తున్నారని పాత్రికేయులు ప్రశ్నించగా మండలంలోని ఓ దేశం నాయకుని అనుమతితోనే పొలాలకు తరలిస్తున్నామని చెప్పడం గమనించదగ్గ విషయం. మండలంలో ఓవైపు మట్టి, మరోవైపు ఇసుక తరలింపు మాఫియా బృందాల సభ్యులకు జేబులు నింపుతోంది. చెరువుల్లో మట్టితవ్వకాలను ఆపాల్సిన ఇరిగేషన్ అధికారులు కనుమరుగైనట్లున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

## టిటిడిలో ప్రక్షాళన జరగాలి

వైకాపా ప్రభుత్వంలో జరిగిన దోపిడీ నుంచి తప్పించుకునేందుకే ఫైల్స్ దగ్ధం

తప్పు చేసిన వారందరికీ శిక్ష తప్పదు , కిరణ్ రాయల్



**తిరుపతి హెల్త్, ఆగస్టు 18, ప్రభాతవార్త** శ్రీ వాణి ట్రస్ట్ కుంభకోణంలోని బాగోతం ఎక్కడ బయటపడు తుందోనని టిటిడి పరిపాలన భవనంలోని శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన ఫైల్స్‌ను దగ్ధం చేశారని తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జి కిరణ్ రాయల్, సుమన్ బాబు, కిషోర్, మనోజ్, ఆది, శ్రీనివాసులు, సుమంత్, గోపి తదితరులు ఫైల్స్ ఫైర్ పై దీప స్తంభాలు, కరెంటు వైర్లను చేతుల్లో పట్టుకుని మీడియాకు చూపిస్తూ ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేదా కావాలనే కాల్చేసారంటూ ప్రశ్నించారు. టిటిడిని తక్షణం ప్రక్షాళన చేయాలన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా ముందు వారు మాట్లాడుతూ మొన్న మదనపల్లి నేడు తిరుపతి వీటిపై రాష్ట్రవ్యాప్తంగా ఫైల్స్ కాల్చిన సంఘటనలను దర్యాప్తు చేసి దీని వెనుక ఉన్న సూత్రధారులను శిక్షించాలని సంబంధిత అధికారులను కోరారు. మాజీ మంత్రి రోజా దేశం విడిచి పారిపోతున్నదని ఆరోపించారు. రోజా సన్నిహితులే ఈ సమాచారాన్ని తమకు అందించారని కిరణ్ రాయల్ స్పష్టం చేశారు. స్పోర్ట్స్ మంత్రిగా రోజా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి 150 కోట్లు అవినీతి చేసిందని ఈ దోపిడి పై రోజాకు జైలు కాయమన్నారు. ఇప్పటికే రోజాకు సన్నిహితులు ఉన్న శ్రీలంక, థాయిలాండ్, ఐలాండ్, జింబాబ్వే కొలంబియా దేశాలకు పారిపోవాలని రోజా ప్రయత్నిస్తున్నదని ఎద్దేవ చేశారు. రోజా పాస్‌పోర్ట్‌ను తక్షణం హ్యాండ్‌వర్ చేసుకోవాలని కిరణ్ సిఐడి ఉన్నతాధికారులను కోరారు.

## హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

తిరుపతి రవాణా, ఆగస్టు 18, ప్రభాతవార్త




నిర్భయ దిశ చట్టాలను కఠిన తరం చేసే మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకట్టు వేస్తూ అత్యాచార దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని టిటిడి ఉమెన్ బార్బర్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధాదేవి డిమాండ్ చేశారు. కలకత్తాలో ఆత్యాచార ఘటనను ఖండిస్తూ నారీగళం ఆధ్వర్యంలో ఆదివారం గాంధీ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలోని ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. జాతీయ స్థాయిలో వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జరిగిన సంఘటనలో దోషులను త్వరగా గుర్తించి వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండాకేంద్ర, రాష్ట్రప్రభుత్వాలుపటిష్టచర్యలుతీసుకోవాలనికోరారు. నారీగళం, మహిళా సంఘాల నాయకురాలు శ్రీలత, జయంతి, వాణి, పార్వతి, వరలక్ష్మి, సంతోష్ పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో చిన్న పిల్లలకు అందించాల్సిన చికిత్స పై అవగాహన

తిరుపతి హెల్త్, ఆగస్టు 18, ప్రభాతవార్త

ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి, చిన్న పిల్లల విభాగంలో అత్యవసర సమయాలలో చిన్న పిల్లలకు అందించాల్సిన చికిత్స పై చిన్న పిల్లల వైద్యులకు, వైద్య విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల నిపుణులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికీ స్వాగతం పలుకుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్న పిల్లల నిపుణులైన కేరళ రాష్ట్రానికి కొట్టాయం నుండి ఎస్వీ వైద్య కళాశాలకు విచ్చేసిన డాక్టర్ బాలచందర్ అత్యవసర సమయాల్లో చిన్న పిల్లలకు ఇచ్చే వైద్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి, కూలంకషంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వైద్యులకు వివరించారు. చిన్న పిల్లల అత్యవసర చికిత్స కార్యక్రమానికి, కర్ణాటక రాష్ట్రం, చిక్కబల్లాపూర్ నుండి డాక్టర్ వెంకటాచలపతి, లక్నో నుండి డాక్టర్ ఘనశ్యామ్ చౌదరి, హిందూపూర్ నుండి డాక్టర్ కేశవులు, అతిధులుగా విచ్చేశారు. మన ప్రాంతంలో వచ్చే జ్వరాలు స్క్రబ్ టైఫాస్, మలేరియా, డెంగీ, లెప్టోస్పైరసిస్, టైఫాయిడ్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్న పిల్లల నిపుణులకు అత్యవసర సమయాల్లో ప్రాథమిక వైద్యం గురించి ఎస్వీ వైద్య కళాశాల చిన్న పిల్లల విభాగ వైద్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల విభాగ ప్రొఫెసర్ డాక్టర్ కిరీటి, డాక్టర్ అంజన్ కుమార్, అసిస్టెంట్లు అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘ సొసైటీలో ఈకేవైసీ చేసుకోండి - సీఈవో

**విజయపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త:** సహకార సంఘ సొసైటీలో రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని అగరం రామకృష్ణ సహకార సంఘం సొసైటీ సీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే సొసైటీ సభ్యులు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, పాస్‌ఫోటో, ఫోన్ నెంబరు, నామిని వివరాలను అందించాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకోలేదంటే ప్రభుత్వ రాయితీ, పథకాలు వర్తించదన్నారు. ఈకేవైసీ చేయకపోతే సొసైటీలో ఓటు హక్కు కూడా కోల్పోతారని, మూడు రోజుల్లో రైతులు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**విజయపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన విజయపురం ఉన్నత పాఠశాల ఆవరణలో వికలాంగుల సేవా సంస్థవారు ఆదివారం సురేంద్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 75 మంది పరీక్షలు నిర్వహించి 15 మందికి ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంస్థ సిబ్బంది ఏసుపాదం, కైలాసం యాదవ్, భాస్కర్‌నాయుడు, మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ల ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకు కృషి చేయండి

ఎంపీ పురంధేశ్వరికి ఆపస్ వినతి

తిరుపతి విద్య, ఆగస్టు 18, ప్రభాతవార్త



ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించి ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేసి టీచర్లకు అన్ని కేడర్లకు అనగా జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్లు, మండల విద్యా శాఖ అధికారులు, డివైఇఒ తదితర ప్రమోషన్లను చేపట్టాలని ఎన్ని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో గత తెలుగు దేశం ప్రభుత్వంలో ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు చేపట్టడం జరిగిందని, మరల కోర్టు వివాదాలు వచ్చిన కారణంగా 2017లో మరల కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర పతి గెజిట్ కూడా తేవడం జరిగిందని మరల కొన్ని వివాదాల కారణంగా అమలుకు నోచుకోలేదని, అమ లులో ఉన్న ఇబ్బందులు తొలగించి ఉమ్మడి సర్వీస్ రూరల్స్ అమలుకు మార్గం సుగమం చేయాలని భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఎంపి దగ్గుపాటి పురందేశ్వరిని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి జివి సత్యనారాయణ, మహిళా కన్వీనర్ పి. పద్మలు కలిసి కోరారు.

## నవీన్ తాజ్‌కి డాక్టరేట్ ప్రధానం

తిరుపతి విద్య, ఆగస్టు 18, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ, విభాగం పరిశోధక విద్యార్థిని ఎస్. నవీన్ తాజ్‌కి ఆ విభాగ ఆచార్యులు వై. ఇందిరా ముజిబ్ పర్యవేక్షణలో డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్ లోడెడ్ ఫార్మకోసోమ్స్ అండ్ ఇన్వాసోమ్స్ యాస్ వేసిక్యూలర్ క్యారియర్స్ ఫర్ ఎన్హాన్సింగ్ ట్రాన్సడెర్మల్ పర్మీయేషన్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య బి. జీవన జ్యోతి తెలిపారు.

## షేక్ ఆశా బేగంకి డాక్టరేట్ ప్రధానం

తిరుపతి విద్య, ఆగస్టు 18, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని షేక్ ఆశా బేగంకి ఆ విభాగ ఆచార్యులు ఎస్. జోష్నా రాణి పర్యవేక్షణలో ఎఫెక్స్ ఆఫ్ అవేర్నెస్ సెషన్స్ ఆన్ కేపేపి అమంగ్ వుమెన్ అండ్ ద డెవలప్మెంట్ ఆఫ్ అ మొబైల్ అప్లికేషన్ ఫర్ ఎర్లీ డిటెక్షన్ ఆఫ్ బ్రెస్ట్ క్యాన్సర్ అనే అంశం పై పరిశోధన చేసినందుకు గాను ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఆ వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య జీవన జ్యోతి తెలిపారు.

## క్రీడాకారులకు యూనిఫామ్ వితరణ

తిరుపతి క్రీడ, ఆగస్టు 18, ప్రభాతవార్త



జెన్ అకాడమీ క్రీడాకారులకు ఆదిత్య బిల్డర్స్ అధినేత నరేంద్ర యాదవ్, జెన్ అకాడమీ అధ్యక్షులు రాజేష్ కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్‌ల చేతుల మీదుగా యూనిఫామ్‌ని అందించారు. ఆదిత్య బిల్డర్స్ నరేంద్రకి క్రీడలు అంటే మక్కువ ఎక్కువ అని గతంలో కూడా చాలా సార్లు పేద క్రీడాకారులకు సహాయం చేసారని వారికి రాజేష్ అభినందనలు తెలిపారు. పేద క్రీడాకారులకు తన వంతు సహాయం అందిస్తానని నరేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, శివకుమార్ రెడ్డి, మధు, చెందులు పాల్గొన్నారు.

## పిచ్చాటూరులో అగ్నిగుండ ప్రవేశం



**పిచ్చాటూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పిచ్చాటూరు పట్టణంలోని ధర్మరాజులు దేవాలయ ఆవరణలో గత పది రోజులుగా జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజు తిరుణాళ్ళలో భాగంగా చివరి రోజు ఆదివారం సాయంత్రం కాగుతున్న నిప్పులపై కాపు కట్టిన భక్తులు గోవిందా...గోవిందా.... అంటూ గోవింద నామస్మరణతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉదయం దుర్యోధన దుశాసన వధ కార్యక్రమం ద్రౌపదీ దేవి కురులను దుర్యోధన రక్తంతో ముడివేసే కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. భీముడు దుర్యోధనుడు వేషధారణ ధరించిన వారు చేసిన యుద్ధ ఘట్టం భయాందోళన కలిగించింది. అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గ్రామ జీర్ణోధరణ కమిటీ సభ్యులు, స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించిన ద్రౌపదీ అమ్మవారు ఉత్సవ విగ్రహం గ్రామ పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ, బాణసంచాల మధ్య ఊరేగించారు. భక్తులు ధూప దీప నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## తొండమాన్ ఆలయంలో పవిత్రోత్సవాలు:

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్స వాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. ఈ నేపధ్యంలో ఆది వారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. టిటిడి సారథ్యం లో నిర్వహిస్తున్న తొండమాన్‌పురంలోని ఆలయంలో టిటిడి తరహాలు సేవా పూజా కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో పవిత్రోత్సవాలను భకక్తుల మనోభావాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో పవిత్రాలను భక్తి భావంతో ఊరేగించి ఆలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ ఆర్.శ్రీనివాసులు టెంపుల్ ఇన్స్ పెక్టర్ పి.రవికుమార్‌రెడ్డి, అర్చకులు సిహెచ్‌వి రమణాచార్యులు, జి.ఆనంద్, గ్రామముఖ్యుడు కందాటి శేఖర్‌పాల్గొన్నారు.

## చిలుకవాహనంపై నీలకంఠేశ్వర స్వామి దర్శనం

**శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో ప్రారంభమైన నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్స వాల్లోభాగంగాఆదివారంరాత్రిచిలుకవాహనంస్వామిఅమ్మవార్లు దర్శనమి చ్చారు. ఇక్కడి బ్రహ్మోత్సవాల్లో ఉదయం ఓ వాహనం, రాత్రి మరో వాహనంపై భక్తులకు దర్శన మివ్వటం ఆనవాయితి ఈ నేపధ్యంలో ఆదివారం ఉత్సవాల్లో భాగంగా రాత్రి స్వామి అమ్మవార్లు చిలుక వాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం జరిపారు. ఆలయ అర్చకులు జనార్థన్‌శర్మ స్వామి అమ్మవార్లకు ముందుకు సాగారు. ఉత్సవంతోపాటుదామోదరం, దుర్గాప్రసాద్, గ్రామ పెద్ద నీలకంఠారెడ్డిలు పాల్గొన్నారు.

## భారతదేశ 21వ శతాబ్దపు మార్గదర్శకుడు రాజీవ్ గాంధీ

కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్ ఉద్ఘటన

తిరుపతి రవాణా, ఆగస్టు 18, ప్రభాతవార్త



భారతదేశానికి 7వ ప్రధానమంత్రి అనిర్వచనీయమైన సేవలు అందించిన రాజీవ్ గాంధీ 21వ శతాబ్దంలో భారతదేశ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచి, ఆయన దార్శనికత, వినూత్న సంస్కరణల ద్వారా దేశ సర్వత్రా కొత్త అధ్యాయాన్ని నెలకొల్పిందని, కేంద్ర పంచాయితీరాజ్ శాఖ మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్ అన్నారు. రాజీవ్ గాంధీ 80వ జయంతి పురస్కరించుకుని భారత గ్రామీణ అధ్యయనం పరిశోధన అకాడమీ ఆదివారం అంతర్‌జలం ద్వారా 21వ శతాబ్దపు భారత దేశ రూపకల్పనలో రాజీవ్ గాంధీ దూరదృష్టి కృషి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మణిశంకర్ అయ్యర్ పాల్గొని ప్రసంగించారు. రాజీవ్ గాంధీ ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రాజీవ్ గాంధీ కాలం నుండి ఇప్పటి వరకు పంచాయితీ రాజ్ పరిణామం అమలులో నేను సన్నిహితంగా మెలిగినందుకు నేను ఒక గొప్ప వ్యక్తిగా భావిస్తున్నారు. 31 సంవత్సరాల క్రితం 73వ రాజ్యాంగ సవరణ చట్టం ఆమోదం పొందిన తర్వాత పంచాయితీరాజ్ వ్యవస్థలో జరిగిన పరిణామాలను సమీక్షిస్తూ పంచాయితీలకు విధులు, ఆర్థిక వ్యవహారాలు కార్యనిర్వాహకులు పరిపూర్ణంగా ఉండాలి. గ్రామ స్థాయిలో అధికారాన్ని కేంద్రీకరించాలని ఊహించిన రాజీవ్‌గాంధీ కలలను అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చలేకపోవడం విచారకరమని వివరించారు. అనంతరం అగ్రశ్రీ వ్యవస్థాపక సంచాలకులు డాక్టర్ డి. సుందరరామ్ అనుసంధానకర్తగా వ్యవహరించగా ఇగ్నోమాజీ వైస్ చాన్సలర్ ఎం. అస్లాం, ఐఎఎస్ రిటైర్డ డబ్ల్యూఆర్ రెడ్డి, ప్రొఫెసర్ సందీప్ శాస్త్రి, ప్రొఫెసర్ మదన్ మోహన్ గోయెల్ వక్తలుగా మాట్లాడుతూ రాజీవ్ గాంధీ 21వ శతాబ్దంలో భారతదేశాన్ని మార్చడానికి వివిధ రంగాలలో తీసుకువచ్చిన బహు పరిమాణ సంస్కరణలను గురించి సోదాహరణంగా వివరించారు. పరిపాలనా అసమర్థత అవినీతి కారణంగా రాజీవ్ గాంధీ గమనించారని తెలిపారు. స్థానికంగా ఎన్నికైన సంస్థలకు అధిక అధికారాలను అప్పగించడమే ఏకైక పరిష్కారమని నిర్ణయానికి వచ్చారని పేర్కొన్నారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో పంచాయితీ రాజ్ సంస్థలు పట్టణ ప్రాంతాల్లో పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించే ఆలోచనకు దారి తీసిందని ఉద్ఘాటించారు. ఈ సమావేశ చర్చల్లో పంచాయితీ రాజ్ సంస్థల ప్రజాప్రతినిధులు, విద్యా వేత్తలు, పరిశోధకులు స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్యానెలిస్టులతో వివిధ అంశాలపై సంభావించారు.

# తిరుపతి డివిజన్

## కారు ఢీకొట్టడంతో స్కూటరిస్టు దుర్మరణం



**ఏర్పేడు, ఆగస్టు18, ప్రభాతవార్త;** సక్రమ మార్గంగా వెళుతున్న స్కూటరిస్టుని వక్రమార్గంలో అతి వేగంగా వచ్చి కారు ఢీకొట్టడంతో స్కూటరిస్టు అక్కడి కక్కడే దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని సీతారాంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఏర్పేడు సిఐ శ్రీరామ శ్రీనివాస్ కనం మేరకు శ్రీకాళహస్తి మండలం సల్లపాళెం గ్రామానికి చెందిన వంకయలపాటి ప్రతాప్‌రెడ్డి కుమారుడు వి. హర్షవర్ధన్ (26) తిరుపతిలోని తన మిత్రున్ని కలిసేందుకు స్కూటీ మీద వెళుతుండగా తిరుపతి నుంచి గూడూరుకి వెలుతున్న మారుతీ సుజికి కారు డ్రైవర్ గణేష్ రాజ్ వక్రమార్గంలో అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో హర్షవర్ధన్ అనే యువకుడు మృతిచెందాడు, కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించడం జరిగిందని తెలిపారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం



హెడ్ కానిస్టేబుల్, హోమ్‌గార్డ్‌పై వేటు క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు , ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరిక

చంద్రగిరి, ఆగస్టు 18 ప్రభాతవార్త:

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన హెడ్ కానిస్టేబుల్, హోమ్‌గార్డుపై తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదివారం సస్పెన్షన్ వేటు వేశారు. వివరాలిలావున్నాయి. మల్లయ్యపల్లి నుండి టిప్పర్లతో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సిఐ రామ య్య స్పందిస్తూ రక్షక్ మొబైల్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.బసవయ్య, హోమ్‌గార్డ్ సుధాకర్‌ను విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ఆ ఇద్దరూ గ్రావెల్ అక్రమ రవాణాను నిలువరించకపోగా సదరు వాహనాలను స్టేషన్‌కు తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో గ్రామస్థులు విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్ళి ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల ఫిర్యాదుపై విచారణ జరిపిన ఎస్పీ ఆ ఇద్దరూ అక్రమార్కుల పక్షాన వ్యవహ రించినట్లు నిరూపితం కావడంతో ఇద్దరినీ సస్పెండ్ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తా యని, శాఖాపరమైన విచారణ సైతం వుంటుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే సిఐకి మెమో జారీ చేశారు. జిల్లాలో ఎవరైనా అవినీతికి పాల్పడినా, విధి నిర్వహణలో అలసత్వం వహించినా, డిపార్ట్‌మెంట్ ప్రతిష్టకు భంగం కలిగించినా, క్రమశిక్షణ తప్పినా క్షమించే ప్రసక్తే లేదనీ, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## భక్తి శ్రద్ధలతో బండి కుంభాలు



రామచంద్రాపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త:

ఎస్.ఆర్.కమ్మపల్లిలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం భక్తి శ్రద్ధలతో బండి కుంభాలు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసర గ్రామాల నుండి భక్తులు బకాసురుడికి బండిలో ఆహారం తీసుకుని ఆలయా నికి చేరుకున్నారు. ఇక్కడ భీమసేనుడు బండి కుంభాలను తీసుకుని బకాసురుడి వద్దకు వెళ్ళడం, అక్కడ వారిరువురికీఘోరయుద్ధంజరగడం, ఆ యుద్ధంలో భీముడు తన బాహుబలంతో బకాసురుడిని వధించడం వంటి ఘట్టాలను శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలి వారు ప్రేక్షకుల కన్నులకు కట్టినట్లు ప్రదర్శించారు.

## కాలుతున్నాయా..

దోషుల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు, బిజెపి నేతల హెచ్చరిక

తిరుపతి హెల్త్, ఆగస్టు 18, ప్రభాతవార్త

మొన్న మదనపల్లి, నిన్న టిటిడి పరిపాలన భవనం తదితర ఫైల్స్ ఫైరింగ్ విషయంలో ఎక్కడ నిజాలు బయటపడతాయన్న భయంతో ఫైల్స్ కాల్చి వేస్తున్న ఇంటి దొంగలకు వారిని నడిపించిన వైసిపి నేతలకు శిక్ష తప్పదని బిజెపి నేతలు భాను ప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, వరప్రసాద్, డాక్టర్ శ్రీహరి రావు తదితరులు హెచ్చరించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా ముందు వారు మాట్లాడుతూ ఈ ఫైల్స్ ఫైరింగ్‌లో సూత్రధారులు, పాత్రధారులు, లబ్ధిదారులు అందరూ కటకటాల వెనక్కి వెళ్ళాల్సిందేనని జోష్యం చెప్పారు.

## 21న కొరముట్ల కూచిపూడి రంగ ప్రవేశం



మహతికి విచ్చేసి తేజస్విని ఆశీర్వదించండి

తిరుపతి హెల్త్, ఆగస్టు 18, ప్రభాతవార్త

టిటిడి మహతి కళాక్షేత్రంలో ఈ నెల 21వ తేది సాయంత్రం 4 గంటల నుండి 8.30 నిమిషముల వరకు కొరముట్ల తేజస్విని కూచిపూడి రంగ ప్రవేశ ప్రదర్శన కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు అందరూ విచ్చేసి తేజస్వినిని ఆశీర్వదించాలని కుటుంబ సభ్యులు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ తేజస్విని యొక్క గురువర్యులు దీప విశ్వమోహన్ ప్రేరణతో అరంగేట్రం చేయబోతున్న ఈ చిన్నారి నృత్య ప్రతిభను సబికులు తిలకించి, ఆశీర్వదించాలని కోరారు.

## దోషుల్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదు

టిడిపి నేతల ఆగ్రహం

తిరుపతి హెల్త్, ఆగస్టు 18, ప్రభాతవార్త



వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతికి సంబంధిం చిన ఫైల్స్‌ను ఆహుతి చేయడానికే ఈ ఫైల్స్ ఫైరింగ్ జరుగు తున్నదని, దీని వెనుక ఉన్న దోషుల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు నరసింహ యాదవ్, రవినా యుడు, చేజర్ల మనోహరాచారి, ఆర్‌సి మునికృష్ణ తదితరులు తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా ముందు వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు వైసిపి ప్రభుత్వంలో జరిగిన అవినీతి, దోపిడిలపై శ్వేత పత్రం విడుదల చేశారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అన్ని తప్పులను బయటపెట్టి దోపిడి దారులను శిక్షిస్తుందని తెలియజేశారు.

## శ్రీవారి పుణ్యక్షేత్రాన్ని కన్నీళ్లు క్షేత్రంగా మార్చారు

చింతామోహన్ విమర్శలు



తిరుపతి హెల్త్, ఆగస్టు 18, ప్రభాతవార్త

రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం చేసిన అవినీతి వలన ప్రస్తుత కూటమి పాలన కుంటుపడిందని మాజీ తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా ముందు ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రసిద్ధికెక్కిన తిరుమల శ్రీవారి ఆలయంకు భక్తులు సమర్పించిన టిటిడి విధులలో అవినీతి చోటు చేసుకుందన్నారు. రెండవ సత్రం తదితర కట్టడాల పేరుతో దాదాపు 1200 కోట్లు దుర్వినియోగం చేశారన్నారు. ఇందులో 10 శాతం కమిషన్ కూడా 100 కోట్లు అవినీతి జరిగిందని ఇది ఎవరిచ్చారు. ఎవరు చేతికి వెళ్లిందని ఇది బహిర్గతం చేయాలంటూ డిమాండ్ చేసారు. లేనిపక్షంలో నేడు ఆదివవారం తాము తలపెడదామనుకున్న నిరసన ధర్నాను వచ్చే ఆదివారంకు వాయిదా వేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టును రాజకీయ నాయకులు వైసిపి కిరణ్ కుమార్ రెడ్డి, చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డిలకు ఓ వరంగా మారిందని ఈ గత సిఎంలు వారి పదవీకాంక్ష కోసం పోలవరాన్ని వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఏపిలో ఆరు విమానాశ్రయాలు తీసుకొస్తామన్న సిఎం చంద్రబాబు ఎయిర్ బస్సుల విషయాన్ని పక్కన పెట్టి మొదట ఆర్టీసి బస్సులను శుభ్రపరచి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని హితవు పలికారు.

## నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎంపిక

పుత్తూరురూరల్, ఆగస్టు 18 ప్రభాతవార్త:

దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం తిరుపతి విశ్వం టాలెంట్ స్కూలు లో సమావేశం జరిగింది. దళిత డప్పు కళాకారుల సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై రాష్ట్ర కమిటీ చర్చించడం జరిగింది. ప్రధానంగా నేటి ప్రభుత్వం దళిత డప్పు కళాకారులకు 4 వేలు పెంచడం అభినంద నీయమని అంతేకాకుండా డప్పు కళాకారులకు వాయిద్య పరికరాలు, దుస్తులు ఇవ్వాలని అలాగే పెన్షన్ వయసు 45 తగ్గించాలని ఇలా అనేక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాలో ఉన్న దళిత డప్పు కళాకారులకు మెరుగైన సేవలు అందించడానికి వారి పక్షాన పోరాటం చేయడానికి ఆదివారం జిల్లా అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎర్రవారిపాళెం మండలానికి చెందిన ధనాసి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన మురగారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కుమార్‌రెడ్డి మారేళ్ళ శ్రీనివాసులు తెలిపారు.

## మునయ్య అంత్యక్రియల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



**రేణిగుంట, ఆగస్టు 18 ప్రభాతవార్త:** టీడీపీ సీనియర్ నాయకులు నగరి మునయ్య(దొడ్ల మిట్ట మునయ్య) అంత్యక్రియల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. శనివారం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్టకు చెందిన టీడీపీ సీనియర్‌నాయకులు మునయ్య మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. ఆయన అంత్యక్రియలో ఎమ్మెల్యే పాల్గొని శ్మశానం వరకు పాడే మోశారు. ముందుగా ఎమ్మెల్యే మునయ్య పార్థీవదేహానికి నివాళులరినపంచి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలపడంతో పాటు వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మునయ్య లాంటి నిస్వార్థ పరుడైన నేతను కోల్పోవడం పార్టీకి తీరని లోటని కన్నీరు పెట్టారు. అంత్యక్రియల కార్యక్రమంలో రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, రేణిగుంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామినాయుడు, టీడీపీ మండల సీనియర్‌నేతలు డి.పుష్పనాథం, చిన్నారెడ్డి, బుజ్జినాయుడు, నాథమునిరెడ్డి, కొరియర్ రవి, కన్నన్‌రెడ్డి, అడ్వకేట్ ఉదయకుమార్‌రెడ్డి టీడీపీ నేతలు, కార్యకర్తలు మునయ్య అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేరికోస్ వెయిన్స్ వైద్యశిభిరాలు మరిన్ని అవసరం

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి

తిరుపతిరూరల్, ఆగస్టు18 ప్రభాతవార్త: ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న కాళ్లలో సిరల వాసు అనే వేరి కోస్ వెయిన్స్ నిర్ధారణ నివారణరు మరిన్ని వైద్య శిబిరాలు అవసర మని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ యు.శ్రీహరి తెలిపారు. ఆదివారం తిరుచానూరులో భువనేష్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మెగావిన్ వాస్క్యులర్ కేర్ నిర్వహించిన వేరికోస్ వెయిన్స్ ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్యఅతిధిగా డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో సుమారు 20 శాతం మందివరకు ఇటువంటి బాధితులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం తరపన వైద్య సేవలు అందుతున్నప్పటికి ఇతర ప్రవేట్



ఆసుపత్రులు కూడా బాధితులలో అవగాహన కల్పించే దిశగా శిబిరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ కె.బాలశంకర్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి వచ్చిన వైద్య నిపుణుల సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. మెగావిన్ వాస్క్యులర్ కేర్ వైద్యులు డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ తిరుపతిలోని డాక్టర్ హరినాథ్ ఆసుపత్రిలో ప్రతి శుక్రవారం అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగావిన్ వైద్యులు డాక్టర్ హరీష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపై ఎస్పీ లంకెల కొరఢా!

### -ట్రాఫిక్‌హోంగార్డు శ్రీనివాసులు సస్పెండ్



తిరుపతి, ఆగస్ట్ 18ప్రభాతవార్త: పోలీసువిభాగంలో అవినీతి,అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రజలకు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో సేవలందించాల్సిన పోలీసులు అవినీతి,అక్రమాలకు పాల్పడుతున్నారా అనే కోణంలో తన వేగులతో ఆరా తీయిస్తున్నారు. దీంతో తిరుపతిలో ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న హోంగార్డు శ్రీనివాసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై. అనధికారికంగా అక్రమ జరిమానా విదిస్తూ వసూళ్లకు పాల్పడ్డాడు. దీనిపై ఎస్పీకి అందిన సమాచారం, ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టి అవినీతికి సంబంధించి ఆధారాలు ఉండటంతో కఠిన చర్యలు తీసుకున్నారు. హోంగార్డు శ్రీనివాసులును సస్పెండ్ చేశారు. దీంతో పోలీసుశాఖలో తిరుపతిలో పనిచేస్తున్న పలువురు ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు, స్టేషన్ రైటర్‌లకు వణుకు పుట్టింది. వీరంతా ఇప్పుడు వసూళ్ళకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారనేది పోలీసుశాఖలో గుప్పుమంటోంది. ఏ అధికారి అయినా ప్రజలకు సేవచేయాలని, బాధ్యతతో పనిచేయాలని అవినీతికి పాల్పడితే సహించేది లేదని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. తిరుపతి జిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను కాపాడేందుకు తనవంతు చూస్తానని అన్నారు.

## జిల్లా 'దేశం' పార్టీ కార్యాలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం



చిత్తూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త: జిల్లా కేంద్రం చిత్తూరులో జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయం నిర్మించడానికి బంగారుపాళ్యం మండల తెలుగుదేశం అధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్ 5 లక్షల రూపాయల విరాళంను జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్‌కు అందజేశారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లను బంగారుపాళ్యం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్ కలిశారు. ఈ మేరకు చిత్తూరు కొంగారెడ్డిపల్లి సమీపంలో నిర్మించనున్న నూతన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం తన వంతు సహాయంగా రూ.5 లక్షలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, గుడిపాల మాజీ జడ్పీటిసీ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మృతిలోనూ వీడని బంధం

### కన్న పేగును కాపాడబోయి -ఎక్సైజ్ కానిస్టేబుల్‌తోపాటు చిన్నారి మృతి

### -విషాదంలో కాటిపేరి



చౌడేపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త కనిపెంచిన బిడ్డను కాపాడబోయి తల్లితో సహా కుంటలో పడి మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం కాటిపేరికి చెందిన చిన్నకుమార్‌రెడ్డి భార్య మౌనిక(30) మదనపల్లి ఎక్సైజ్ లిక్కర్ డిపోలో వుంటూ పుంగనూరు పరిధిలోని 4, బోయకొండ ప్రభుత్వ మద్యం దుకాణాల పర్యవేక్షకురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్ద తనతోపాటు పుంగనూరు భాష్యంలో 2వ తరగతి చదువుతున్న కుమార్తె అనీషారెడ్డి(7), కుమారుడు తనీష్‌రెడ్డిలు వ్యవసాయ పొలం వద్దకు పశువులును తీసుకొని మేత కోసం వెళ్ళారు. సాయంత్రం పొలం నుంచి పశువులను తరలించుకొని వస్తుండగా గ్రామానికి సమీపంలోని నాగంకుంటకు కొంత దూరంలో గల ఉపాధినీటి కయ్యం వైపుకు నీరు తాగేందుకు బాలికను పశువులు లాక్కొని వెళ్ళాయి. గుర్తించిన మౌనిక పరుగున వెళ్ళింది. అయితే బాలిక ప్రమాదవశాత్తు లోతుగా వున్న కయ్యంలోకి పడింది. పాపాయిన రక్షించాలనే తలంపుతో మౌనిక సైతం నీటిలోకి మునిగింది. ఇద్దరూ ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో కుమారుడు తనీష్‌రెడ్డి కేకలు వేసుకొంటూ గ్రామంలోకి పరుగులు తీశాడు. వెంటనే గ్రామస్తులు నీటికయ్యంలోకి దిగి చూసేసరికి అప్పటికే తల్లీ, కుమార్తెలు మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే కాటిపేరిలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకొన్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలు మౌనికది రామసముద్రం మండలం కొండూరు.

## పాతకాల్వలో ఆకట్టుకున్న దుర్యోధన వధ



తిరుపతిరూరల్, ఆగస్టు18 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం పాతకాల్వ గ్రామ పంచాయతీలో శ్రీద్రౌపది సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో మహ భారత ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమం చూపర్లను ఆకట్టుకుంది. మహాభారతంలో బృహత్తర ఘట్టమైన దుర్యోధన వధ కార్యక్రమంలో యుద్ద విన్యాసాలు ప్రేక్షకులను కనువిందు చేసాయి. దుర్యోధన వధ అనంతరం రాత్రి అగ్ని గుండం నిర్వహించారు. పాతకాల్వ గ్రామంలో ఈనెల 7వ తేదీ నుండి 18వ తేదీ వరకు శ్రీద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి 32వ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో మహాభారతం ఉత్సవాలకు ఇప్పటికి ప్రాధాన్యత సంతరించుకుని వుంది. ఈ ఉత్సవాలలో మహాభారతం హరికథ వినేందుకు, నాటక ప్రదర్శన తిలకించటానికి ఎక్కువ మంది వస్తుంటారు. సాధారణంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెల మధ్యలో మహాభారత ఉత్సవాలను నిర్వహిస్తూ ఉంటారు. తిరుపతిరూరల్ మండలం పాతకాల్వ గ్రామ పంచాయతీలో ప్రతిరోజు మధ్యాహ్నం 1:30 గంటల నుండి సాయంత్రం 5:30గంటల వరకు హరికథ చెప్పారు. 8న భీష్మ ప్రతిజ్ఞ, 9న పాండవ జననం, 10న హిడింబాసురవధ, 11న ద్రౌపది స్వయంవరం, 12న సుభద్ర కళ్యాణం, 13న రాజసూయ యాగం, 14న ద్రౌపది మాన సంరక్షణ, 15న అరణ్య పర్వం, 16న శ్రీకృష్ణ రాయభారము, 17న పద్మవ్యూహం, 18న కర్ణ మోక్షం, దుర్యోధన వధ తో మహాభారత ఉత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

## ఇసుక టిప్పర్ సీజ్..ఇద్దరిపై కేసు నమోదు

గంగవరం,ఆగస్టు 18, ప్రభాతవార్త : కర్ణాటకకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గవగవరం అర్బన్ సిఐ బొడ్డు ప్రసాద్ తెలిపారు.సిఐ కథనంమేరకు వివరాలిలా..మండలంలోని తాళ్ళపల్లె పంచాయతీ తమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రెడ్డెప్పనాయుడు కుమారుడు గిరీష్‌నాయుడు మండలంలోని తాళ్ళపల్లె,గంగవరం పంచాయతీల పరిధిలోని కౌండిన్య నది పరివాహక ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా రవాణా చేసి ఉయ్యాలమిట్ట సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచి అక్కడి నుండి టిప్పర్‌ల ద్వారా కర్ణాటకకు,పుంగనూరుకు రవాణా చేసేవాడనితెలిపారు.ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి గిరీష్ పుంగనూరుకు చెందిన జేయం రాఘవ అనే టిప్పర్ యజమానితో ఇసుకను అక్రమ రవాణా చేయడానికి ముందు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారంఉయ్యాలమిట్ట సమీపంలో ఇసుకను అక్రమంగా టిప్పర్‌ల ద్వారా కర్ణాటకకు రవాణా చేస్తున్నారని సమాచారం అందడంతో అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్ళి దాడి చేయగా ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పుంగనూరు పట్టణం ఎన్ఎస్ పేటకు చెందిన డ్రైవర్ విక్రమ్‌కుమార్(24),గిరీష్(25)లపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పరారైయ్యాడని, పరారీలోఉన్న నిందితుని తొందరలోనే అదుపులోకి తీసుకుని అరెస్టు చేస్తామని సిఐ పేర్కొన్నారు.

## సుందరపురం వద్ద స్థలం వివాదం

### - భక్తి పేరుతో మోసమంటూ ప్రచారం



తడ, ఆగస్టు 18 ప్రభాతవార్త తడ మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని సుందరపురం వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న ట్టుండి ఒక ఇంటి నిర్మాణం చేపట్టారు. అది శక్తిపీఠం గా చెప్పుకుంటూ అక్కడే ఆయుర్వేద మందులు విక్రయిస్తూ, పాము, తేలు కరిస్తే మంత్రాలు వేస్తూ మూఢనమ్మకాలు ప్రచారం చేస్తున్నట్లు ఒక వ్యక్తిపై ఆరోపణలు వచ్చాయి. శేషగిరిరావు అనే ఒక స్వామీజి పుట్టుకొచ్చి కృష్ణా జిల్లా నుంచి సూళ్లూరుపేటకు వచ్చి మాయలు మంత్రాలు చూపించేవాడని, ఆ తర్వాత అతను జాతీయ రహదారి పక్కన కొండూరమ్మగుంట వద్ద కొంతమంది స్థానికుల సాయంతో విలువైన స్థలం ఆక్రమించి శక్తిపీఠం నిర్మిస్తున్నట్లు గ్రామ యువకులు కొందరు ఆరోపిస్తున్నారు. అయితే అతను దొంగ పూజలు కూడా చేస్తున్నాడని, అమాయక ప్రజలను మోసం చేస్తున్నాడని జన విజ్ఞాన వేదిక దృష్టికి వెళ్లగా వారు ఆదివారం మధ్యాహ్నం ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. అయితే అప్పటికే శేషగిరిరావు అక్కడి నుంచి వెళ్లిపోగా, సుందరపురం ప్రాథమిక పాఠశాల వద్ద గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షుద్రపూజలను నమ్మవద్దని, అదేవిధంగా అనుమతుల్లేని ఆయుర్వేద మందులను వాడవద్దని వీరు గ్రామస్తులతో చెప్పారు. శేషగిరిరావు ఆక్రమించిన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గ్రామస్తులకు ఉపయోగించాలని చెప్పారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ నుంచి పెంచలయ్య, బుజ్జయ్య, యుటిఎఫ్‌కు చెందిన రాజశేఖర్, చంద్రశేఖర్, సిఐటియు నాయకులు మునెయ్య, సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం పూర్తి కాగానే గ్రామంలోని ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. కొంతమంది స్వామీజికి మద్దతుగా నిలిచి, ఫిర్యాదు చేసిన యువకులతో వాదులాటకు దిగడంతో కొంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ అంశాన్ని ఉన్నతాధికారులు పట్టించుకొని గ్రామంలో ముదురుతున్న గొడవలకు మొదట్లోనే ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు.

## పడవేటమ్మ సేవలో గాలి భానుప్రకాష్



విజయపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త: మండలంలోని ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో ఆదివారం పడవేటమ్మ తిరుణాళ్ళ వైభవంగా నిర్వహించారు. వీధుల్లో వేప తోరణాలు కట్టి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి అంబళి పోసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పడవేటమ్మ సేవలో పాల్గొనఇ మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే భానుని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, ధనంజయయాదవ్, గుణ భూషణమ్మ, ఆర్ముగం, జగన్, చంద్రయ్య, జయరాజ్, సెల్వం, రవిచంద్రారెడ్డి, ముని భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొండపై ఉన్న వీరంతా ఎవరు!?

### -ఇక్కడే తిష్టవేయడం ఎందుకు -తిరుమలలో పోలీసు,విజిలెన్స్ తనిఖీలు



తిరుమల,ఆగస్ట్ 17ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో భక్తుల భద్రత,స్వామివారి ఆలయానికి మరింత రక్షణ కోసం అసాంఘిక ,అనధికార వ్యక్తులు తిష్టవేశారనే అనుమానంతో పోలీసులు, విజిలెన్స్ సెక్యూరిటీ విభాగం ఆదివారం ఉదయం జల్లెడపట్టింది. బాలాజీనగర్‌వెనుక కార్మికుల గుడారాలపై ఆదివారం ఉదయం నుండి దాదాపు నాలుగుగంటలపైగా వేట ప్రారంభించారు. కొండపై కాటేజీలు, అతిధిగృహాలు ఆధునీకరణ పనులకు కాంట్రాక్టర్లు బయటి రాష్ట్రాలనుండి కార్మికులను తీసుకువచ్చారు. హోటళ్ళు, చిన్నచిన్న వ్యాపారాల్లో కార్మికులు బయటి రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వారే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు ముందు తిరుమలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు, అసాంఘిక ,అనధికార వ్యక్తులు తిష్టవేయకుండా ఉండేందుకు తనిఖీలు చేపట్టారు.

## దివ్యారామం వాకర్స్‌తో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చిట్ చాట్



తిరుపతి హెల్త్, ఆగస్టు 18, ప్రభాతవార్త తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అలిపిరి రోడ్డు నందు దివ్యారామం పార్క్‌కు ప్రజలతో మమేకమైందుకు వాకింగ్ చేస్తూ నియోజకవర్గ సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. తరువాత నడక వలన ఆరోగ్యం బాగుంటుందని, చక్కటి వ్యాయామాలను చేస్తూ తిరుపతి ప్రజలు అందరు ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, తమ్మినేని వెంకటేశ్వర్లు, రవీంద్ర తదితర వాకర్స్ పాల్గొన్నారు.

## కోటలో అవినీతి పరులు ఏవరో ప్రజలకు తెలియదా ?

### వైసీపీ పై తెదేపా నాయకులు ధ్వజం



కోట,ఆగస్టు 18 ప్రభాతవార్త కోట పంచాయతీలో అవినీతి పరులు ఎవరు ప్రజలకు బాగ తెలుసునని తెదేపా తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి, తూపిలి రాధకృష్ణరెడ్డి, కోట ఎంపిటిసి, షక్,షంషద్దీన్,,మండల తెదేపా ఉపాధ్యాక్షులు మర్రి అనిల్,అన్నారు. వారు ఆదివారం కోటలోని మండల తెదేపా కన్వీనర్ మద్దాలి సర్వోత్తం రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆనాటి కోవూరు శాసన సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గత కరోన సమయంలో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు రూ 30 లక్షల అవినీతి జరిగిందని ఆరోపించారని వారు గుర్తు చేశారు. కోటలో బంకు పెట్టుకోవాలన్న, లేవుట్లు వేయాలన్న, నాలుగు అంతస్తుల ఇళ్ల నిర్మాణం చేపట్టలన్నా ముందుగా వారికి ఇవ్వాల్సిన కమిషన్లు ఇవ్వాల్సిందనని ఆరోపించారు.కోట పంచాయతీకి ఆదాయ వనురు అయిన ఆర్టీసీ దుకాణాదారుతో తెదేపా లాలాచీ పడలేదన్నారు. వారి వద్ద నుంచి రూ 22 లక్షల మేరు పంచాయతీకి బాడుగులు కట్టించమన్నారు.తెదేపా పై వైకాపా నాయకులు దుష్పప్రచారం చేయడం సరికాదన్నారు.పంచాయతీలో ఆరు మోటార్లు చేడిపోతే రూ 19 లక్షలు ఖర్చు రాశారని వారు ఆరోపించారు. వీటి అన్నింటినిపై విచారణ జరిపి దోషలకు శిక్ష పడేటట్లు చేస్తామన్నారు. తెదేపా నాయకులపై అనవసరంగా నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తు ఊరుకోనేది లేదని వారి అంతు చూస్తామన్నారు. ఈ సమావేశంలో పోర్లలీడర్ బాబు,నియోజకవర్గ మైనార్టీ సెల్ నౌషాద్, పట్టణ కార్యదర్శి,తల్లం శ్రీనివాసులు,ఎంపిటిసి దార సురేష్, మండల మహిళా అధ్యక్షరాలు,పోలమ్మ,తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోండి

### గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



గూడూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త అతి తక్కువ ఖర్చుతో చెన్నై నగరంలో ఉన్న కెవిటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలు దొరుకుతాయని గూడూరు నియోజకవర్గం పరిధిలోని పేద ప్రజలు ఈ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ పాఠశాలలో బుజ్జమ్మ సేవా ట్రస్ట్ నిర్వాహకుడు రత్నం ఆధ్వర్యంలో చెన్నై నగరానికి చెందిన కేవీపీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్, మెగా రక్తదాన శిభిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. మెగా రక్తదాన శిభిరంలో రక్తదానం చేసిన వారిని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి మెగా మెడికల్ క్యాంపుల ద్వారా పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అందుకు కెవిటి ఆసుపత్రి యాజమాన్యం సహకరించాలని విజ్ఞాప్తి చేశారు. ఈ కార్యమ్రంలో టిడిపి నాయకులు కిరణ్ కుమార్, తానంకీ నానాజీ, భాస్కర్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి, రహీం, నరసింహులు ట్రస్ట్ నిర్వాహకుడు రత్నం, కెవిటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకులు వివేకానందన్, ఆసుపత్రి చైర్మన్ సెందిమిన్, వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంకు పోటెత్తిన భక్తజనం

### -దర్శనానికి నాలుగు గంటల సమయం



కాణిపాకం, ఆగస్టు 18 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయం ఆదివారం భక్తుల రద్దీతో జనసందంగా మారింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజు ల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రంల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే తీర్థజనం కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు తిరువణ్ణామలై వెళ్ళే భక్తులు వచ్చిన బస్సులు భారీ వాహనాలతో వాహన పార్కింగ్‌లు కిటకిటలాడాయి.

## మురుగేష్ అక్రమాలకు అడ్డే లే కుండాపోయింది

### - మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



కుప్పం, ఆగస్టు 18 ప్రభాతవార్త వైకాపా పాలనలో కుప్పం మండల వైకాపా కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ అక్రమాలకు అడ్డే లే కుండా పోయిందని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళ్లలేని వ్యక్తి కణ్మణిని మోసగించి అతని భూమిని మురుగేష్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. మల్లానూరులో వాటర్ ట్యా ంకును కబ్జా చేసి భవనం నిర్మించలేదా అని ప్రశ్నించారు. అడవిబూదుగూరులో విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్ర ఇంటి స్థలంలో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. మల్లానూరులోని వినాయక ఆలయంకు చెందిన అంగళ్లను దౌర్జన్యంగా కూలదోయించి చిరువ్యాపారుల పొట్టకొట్టలేదా అని ప్రశ్నించారు. మల్లానూరులో రోడ్డు వెడల్పుకు ఎలాంటి జిఒలు లేకున్నా దౌర్జన్యంగా రోడ్డు వెడల్పు చేయించి ప్రజలను ఇబ్బందులపాలు చేశారన్నారు. గత ఎనిమిది నెలల క్రితం పంచాయతీ ట్రాక్టర్‌ను అపహరించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇలా అక్రమాలకు పాల్పడిన హెచ్ఎం మురుగేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తే తామే కావాలని అరెస్ట్ చేయించామని చెప్పడం దారుణమన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రామచంద్ర, నేతలు మోహన్, పార్థసారథి, సుబ్బు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత సమర్థవంతంగా ఉండాలంటే దేవుని భయం అవసరం- పాస్టర్ డేవిడ్

వెంకటగిరిరూరల్ ఆగస్టు 18 ప్రభాతవార్త: నేడు సమాజంలో యువత చేడు వ్యసనాలకు బానిసలు కావడంతో తమ జీవితం సర్వ నాశనం చేసుకోంటున్నరని యువతకి దైవ భయం ఉంటే సమర్ధవంతంమైన జీవన విధానం కోన సాగిస్తారని సీయోన్ గాస్పాల్ మినిస్ట్రీస్ ఆదినేత పాస్టర్ ఎ డేవిడ్ అన్నారు.అదివారం సీయోన్ గాస్పాల్ చర్చిలో ఆర్యంలో యూత్ మోగా సువార్త సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వందలాది మంది యువత పాల్గోని బైబిల్ సందేశం అలకించారు.ఈ సందర్బంగా పాస్టర్ డేవిడ్ మాట్లడుతూ తల్లి తండ్రులు తమ పిల్లలను చిన్న వయస్సులోనే మంచి మార్గం వైపు నడిపించడంతోపాటు దేవుని భయం తో పెంచడం వల్ల వారు పెద్దవారు అయిన మంచి ప్రయోజకులుగా ఉంటారని యువత చేడు మార్గలను వదలి దేవుని వైపు పయనించడం వల్ల జీవితంలో మంచి ప్రయోజకులు అవుతారని తెలిపారు.అదేవిదంగా యేసు క్రీస్తు సందేశంబైబిల్‌లోఅంశాలను యువతకు తెలియజేశారు.అనంతరం వెంకటగిరి చర్చి ఆద్వర్యంలో పాస్టర్లుకు ప్రోత్సహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్దానిక క్రైస్తువులు తదితరులు పాల్గోన్నారు.

## గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు ....

### పట్టించుకోని ఎస్ఈబి-పోలీసులు ....

దొరవారిసత్రం ఆగస్టు 18 ప్రభాతవార్త ; మండలంలోని ఏకొల్లు,వేణుంబాకం,వెదురుపట్టు,బూదూరు,ఉచ్చూరు,మీజూరు,తదితర గ్రామాల్లో కొంతమంది అక్రమార్కులు బెల్టుషాపులను విచ్చలవిడిగా నిర్వహిస్తున్న సంబందిత ఎస్ఈబి-పోలీసులు మాత్రం పట్టించుకోవడంలేదని గ్రామీణ మహిళలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడం వల్లన యువత ఎక్కువగా మద్యానికి భానిసౌతున్నారని ప్రజలు వాపోతున్నారు.బెల్టుషాపులను గ్రామాల్లో నిర్మిలించాలని మహిళలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపిన అధికారులు పట్టించుకొన్న దాఖలాలు మాత్రం కనిపించలేదన్నారు.స్వతంత్ర దినోత్సం సందర్బంగా ప్రభుత్వం బ్రాందిషాపులును మూసివేయడంతో బెల్టుషాపుల నిర్వహకులకు వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగింది.గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపుల్లో ఎమ్ఆర్పి ధరలకన్న ఒక బాటిళ్ళుపై 50 నుండి 100 రూపాయల వరకు అధనంగా మందుబాబుల నుండి వసూళ్ళు చేస్తున్నట్లు మందుభాబులు ఆరోపిస్తున్నారు.గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడం వల్లన ఎన్నొకుటుంభాలు మద్యనికి భానిసై వీదినపడినట్లు భాదిత మహిళలు తమగోడు వెల్లబుచ్చుతున్నారు.మరికొన్ని గ్రామాల్లో మద్యంసేవించి మహిళలపై అత్యాచారానికి పాల్పడిన సందర్భాలు కూడ జరిగివున్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులను నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ మహళలు అధికారులను కోరుతున్నారు.

## చిరుత దాడిలో పాడిఆవు మృతి

### -రూ. 50వేలు నష్టం

చౌడేపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త చిరుత దాడిలో పాడిఆవు మృతి చెంది రూ. 50వేలు నష్టం వాటిళ్ళిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధిత రైతు కథనం మేరకు...మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరు హుసేన్‌కు పాడిఆవులు ఉన్నాయి. ఈక్రమంలో గ్రామస్తుల పశువులతో కలసి సమీపంలోని అడవిలోకి మేత కోసం తరలించారు. మేత మేస్తూ దాహార్తిని తీర్చుకొనేందుకు పశువులు కోనకుంట వైపు వెళ్ళాయి. అక్కడే మాటు వేసివున్న చిరుత ఆవుల మందపై పడింది. ఈ దాడిలో రూ. 50వేలు విలువ చేయు పాడి ఆవు అక్కడిక్కడే మృతి చెందినట్లు రైతు హుసేన్ వాపోయాడు. సమాచారం తెలుసుకొన్న మదనపల్లి డిప్యూటీ ఫారెస్టు అధికారి మదన్‌మోహన్, తవళం బీటాసాఫీసర్ దీపిక, రెవిన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. వ్యవసాయం జూదంలా మారిని ప్రస్తుత పరిస్థితుల్లో పాడి

# పుత్తూరులో నాసిరకం బంగారు ఆభరణాల విక్రయాలు

## విజయ్‌బాబు



పుత్తూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త : పుత్తూరు పట్టణంలో నాసిరకం బంగారు ఆభరణాల విక్రయాలు జరుగుతున్నందు వల్ల ప్రజలు ఆర్ధికంగా నష్టపోతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ఆరోపించారు. నాణ్యత లేని బంగారం ఆభరణాలను అమ్ముతూ వ్యాపారులు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆ మేరకు ప్రజలు ఆభరణాలను కొనుగోలు చేసేటపుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆదివారం ఎంబి రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా 916 మార్క్ వున్న బంగారు ఆభరణాలను కొనుగోలు చేసినట్టయితే....తిరిగి వాటిని విక్రయించినపుడు కొంచెం అటుఇటూగా కొనుగోలు చేసిన ధర వినియోగదారునికి లభించాల్సి వుంటుందన్నారు. అయితే పుత్తూరు పట్టణంలో కొన్న ఆభరణాలు తిరుపతి లాంటి పట్టణాల్లో విక్రయిస్తే కొన్న రేటు కంటే 30 శాతం తక్కువ ధర పలుకుతోందని తెలిపారు. ఉదాహరణకు రూ. 7000 వేలకు పుత్తూరులో బంగారం కొని మరెక్కడైనా దానిని విక్రయిస్తే రూ. 4000 కూడా చేతికి రావడం లేదని వివరించారు. పుత్తూరులో కొనుగోలు చేసే బంగారు ఆభరణాల్లో రాగి శాతం ఎక్కువగా వుండడం వల్ల ధరించిన కొన్నాళ్లకే రంగు మారిపోతోందని తెలిపారు. దీనిపై ప్రజలెవరైనా దుకాణాదారులను ప్రశ్నిస్తే వారు సరిగ్గా సమాధానం ఇవ్వడం లేదన్నారు. కొన్న బంగారానికి బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఇకపై పుత్తూరులో ప్రజలు 916 మార్క్ వున్న బంగారు ఆభరణాలను మాత్రమే కొనుగోలు చేయాలని ఒకవేళ తేడా వస్తే దుకాణాదారులను ప్రశ్నించి, నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ విషయమై సమస్య ఏర్పడితే దానిని తాను మద్దతుగా నిలబడతానని తెలిపారు. అలాగే దుకాణాదారులు కూడా 916 బంగారాన్నే అమ్మాలని లేని పక్షంలో దశల వారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.